విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రయాణీకులతో రద్దీగా వుంది. ఎనౌన్స్‌మెంట్ అనంతరం మూడవ నెంబర్ ఫ్లాట్ ఫారం మీదకొచ్చి ఆగింది కోణార్క్ ఎక్స్‌ప్రెస్. చేతిలో బ్యాగ్‌తో జనరల్ కంపార్ట్‌మెంట్‌వైపు వేగంగా పరుగెత్తాను. అప్పటికి గంటన్నరనుండి ట్రైన్‌కోసం ఎదురుచూస్తూ స్టాండింగ్‌లో వున్నానేమో పరుగెత్తుతుంటే కాళ్ళల్లో నొప్పి పుట్టి అవిర్లెస్తున్నాయి.

''సార్! జనరల్ బోగీ, కిటికీ పక్కసీటు'' దాదాపు నా కాళ్లకు అడ్డం పడిపోయి అడిగాడు ఓ లావుపాటి వ్యక్తి. మొదట పోర్టరేమో అనుకున్నాను. కానీ అతని వాలకం చూసి పోర్టర్ కాదని గ్రహించి ప్రశ్నార్థకంగా చూసాను అతనివైపు.

''జనరల్ బోగీలో సీటు కావాలంటే చెప్పండి. వద్దంటే స్టాండింగ్ తప్పదు. అన్ని బోగీలు రద్దీగానే వున్నాయి. త్వరగా చెప్పండి సార్'' అని నన్ను తొందర చేయసాగాడు. అప్పుడుగానీ అసలు విషయం అర్థంకాలేదు నాకు. నాలో నేను చిన్నగా నవ్వుకుని ఆలోచించాను. విజయవాడవరకు ప్రయాణం. రిజర్వేషన్ లేదు. ఈ రద్దీ చూస్తుంటే సీటు దొరకదని అక్షరాలా చెప్పొచ్చు. ఇంత జనంలో ఒకర్నొకరు తోసుకుని ఇరుకుగా నిలబడేకంటే అయిదో పదో పోయినా ఇదే నయం అని నా ఆలోచనలు బయటపడకుండా జాగ్రత్తపడి పైకి మాత్రం చిరునవ్వుతో ''ఎంత?'' అని అడిగాను.

''ఎక్కడికి వెళ్తున్నారు మీరు?'' అని ఎదురుప్రశ్న వేసాడు.

''ఓహో అది కూడా చెప్పాలా నీకు?'' అని ఎందుకైనా మంచిదని ''రాజమండ్రి'' అన్నాను.

విజయవాడ అని చెప్పడంవల్ల రేటు విషయంలో తేడా రావచ్చని నా అనుమానం. అబద్ధం చెప్పడంవలన వచ్చే నష్టమేమీలేదు. అయినా వీడేమీ టిక్కెట్ కలెక్టర్ కాదుకదా టిక్కెట్ చూపించమని అడగడానికి.

''ముప్పై రూపాయలివ్వండి'' అన్నాడు.

''పది రూపాయలిస్తాను'' స్థిరంగా చెప్పాను.

ముందు ఒప్పుకోలేదు. తర్వాత అటు లాగి ఇటు లాగి చివరకు పదిహేను రూపాయలకు బేరం సెటిల్ చేసాడు. ఇద్దరం వేగంగా జనరల్ బోగీలోకి నడిచాం. ముందు చెప్పినట్లుగానే కిటికీ ప్రక్కసీటు. అప్పటికే ఆ సీట్లో కూర్చునివున్న పదేళ్ళ కుర్రాడు ఆ లావుపాటివాడిని, నన్నూ చూసి విషయం అర్థమైనవాడిలా లేచి సీటిచ్చేసాడు. మరి కొద్ది నిముషాల తరువాత నా ఎదుట సీట్లో కూర్చున్న మరో కుర్రాడు ఆ లావుపాటివాడు వెంటబెట్టుకుని వచ్చిన మరో వ్యక్తిని చూసి లేచి సీటిచ్చేశాడు. నీతి, అవినీతి ఏదైతేనేం డబ్బు సంపాదనకు అనేక మార్గాలున్నాయని తెలుసుగానీ ఇలాంటి మార్గాలు కూడా వుంటాయని అప్పుడే తెలిసింది నాకు. ట్రైన్ స్టేషన్‌లో స్లో అవుతుండగానే లోపలకు చొరబడో లేక కిటికీలోనుండి జేబురుమాళ్ళు విసిరో సీట్లు సంపాదించి అమ్ముకుని ఈ విధంగా సొమ్ము చేసుకుంటున్నారు. కళ్ళముందే ఇంత విచ్చలవిడిగా మోసం చేస్తున్నా రైల్వే పోలీసులు, అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాలేదు.

క్షణాల్లో బోగీ అంతా క్రిక్కిరిసిపోయింది.

భారతదేశ జనాభానంతా తానే మోస్తున్నంత గర్వంగా దూరాన్ని కొలుస్తూ కదిలింది ట్రైను. కొంత ప్రయాణం తరువాత నా ఎదురుగా కూర్చున్న వ్యక్తి అడిగాడు.


''మీ ప్రయాణం ఎంతవరకు?''

''విజయవాడ. మీరు?'' అన్నాను.

''విజయవాడేనండీ. బైదిబై నా పేరు సురేంద్ర'' అన్నాడు ఆ యువకుడు తన చేతికి నాచేతికి కరచాలనంగా అందిస్తూ.

''నైస్ టూ మీట్ యూ. నా పేరు చక్రపాణి'' అని నా చెయ్యి అందించాను. మా సంభాషణ స్వదేశీ రాజకీయాలవద్ద ప్రారంభమై అమాయక ప్రజలను మోసం చేస్తున్న కపట స్వాముల నుండి మార్కెట్లు ధరలవరకూ వెళ్లి చివరకు రైల్వే డిపార్ట్‌మెంట్‌వైపు మళ్లింది.

''మన రైల్వేబోగీలలో కనీస సౌకర్యాలు ఎలానూ వుండవు. కనీసం జనరల్ బోగీలో సీట్లు కూడా దొరకడం



# అనపర్తి సీతారాము

# మళ్ళీ కలుద్దాం!

లేదు'' అన్నాడు సురేంద్ర.

''నిజమేగానీ మీకు సీటు దొరికింది కదా?'' అన్నాను నాకేం తెలియనట్లుగా.

''అయ్యో లేదండీ. ఆఫీసు పనిమీద అర్జెంటుగా విజయవాడ వెళ్లవలసి వచ్చింది. రిజర్వేషన్ కోసం ప్రయత్నించినా దొరకలేదు. రిజర్వేషన్ లేదని ప్రయాణాన్ని వాయిదా వేసుకునే ఉద్యోగం కాదు. చెప్తే నమ్మరుగానీ కేవలం కొన్ని గంటల ప్రయాణానికి కూర్చునే ఈ సీటు డబ్బులిచ్చి కొన్నాను'' సురేంద్ర గొంతులో ఆవేదన ధ్వనించింది.

''నేనూ మీలా సీటు బాధితుడ్నే. మా స్వస్థలం విజయవాడ. ఉద్యోగ నిమిత్తమై పదిసంవత్సరాలుగా విశాఖపట్నంలో వుంటున్నాను. మా నాన్నగారి నుండి మాకు సంక్రమించిన ఆస్తిలో ఊరి చివరనున్న నాలుగెకరాల మెరకపై కోర్టులో మూడు సంవత్సరాలుగా కేసు నడుస్తోంది. ఈ రోజు మధ్యాహ్నం విజయవాడ నుండి మా లాయర్‌గారు ఫోన్‌చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ రేపు మధ్యాహ్నంకల్లా కోర్టులో హాజరుకమ్మని ఆదేశించారు. మన పరిస్థితులు, ఇబ్బందుల్ని చెప్పినా వాళ్ళకి అర్థమవ్వదుకదా. అలా ఈ ప్రయాణం తప్పనిసరై రాత్రంతా నిల్చుని ప్రయాణించలేక నేను కూడా డబ్బులిచ్చి ఈ సీటు కొన్నాను'' అని అంతా వివరించాను.

''కానీ సార్! ఒక విధంగా మనం దీన్ని ప్రోత్సహిస్తున్నామా కాదా?'' అడిగాడు సురేంద్ర.

''ప్రోత్సహిస్తున్నామా అంటే మీరన్నదాంట్లో కొంత సత్యం లేకపోలేదు. కానీ మనమేం చేయగలం చెప్పండి. మీరు, నేను తప్పించుకున్నా మన పక్కవాడే మళ్లీ మోసపోతున్నాడు'' అన్నాను.

''అందరూ అలా అనుకోబట్టేకదా ఒకరికి తెలియకుండా మరొకరు మోసపోతున్నాం. అందరం ఏకమై పోలీసులకు అప్పగిస్తే వెధవలకు బుద్ధి వస్తుందేమో. అయినా బ్రతకడానికి వేరే పనులు లేవంటారా?''

''శ్రమించి పని చేయాలేగానీ పనులెందుకు లేవండీ. కానీ ఒక అన్యాయాన్ని ఎదుర్కొనే సమయమేలేదు మనకి. ఎవరికి వారే బిజీ. ఎవ్వరైనా సరే పది రూపాయలు పోయినా ఫర్వాలేదనుకుంటున్నారు కానీ మీరు చెప్పినంత రిస్క్ తీసుకోవడంలేదు. ఒకవేళ మీలాంటి యువకులు ముందుకొచ్చి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించుదామన్నా పోలీసులు సమయానికిరారు. వచ్చినా మనకేం సహాయపడరు. మనం వెళ్లిపోగానే వాళ్లతో పోలీసులు కూడా కుమ్మక్కైపోతే మనం చేసేదేమీ ఉండదు'' అని చెప్పి వెనక్కి జార్లబడ్డాను.

''మీరు చెప్పింది నిజమే'' సురేంద్ర గొంతులో గాంభీర్యం చోటుచేసుకుంది.

మా సంభాషణ అలా కొనసాగుతుండగానే ట్రైన్ విజయవాడ స్టేషన్‌లో ఆగింది. నేను సీట్లోంచి లేచి బ్యాగ్ తీసుకుంటుండగా ఒక వ్యక్తి అందర్నీ తోసుకుంటూ వడివడిగా వచ్చి నా సీటులో కూలబడిపోయాడు.

సురేంద్ర, నేనూ అవాక్కై ముఖాలు చూసుకున్నాం. కళ్ళముందే మోసం జరిగినా గొంతెత్తి అరిచే ధైర్యం, చొరవ లేకపోవడంకంటే హేయమైన చర్య మరొకటి వుంటుందా? అనిపించింది.

ఒక్కొక్కరే దిగడానికి సిద్ధపడుతున్నారు. సురేంద్ర సీట్లోంచి లేవకుండా కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే ఉండిపోయాడు. తను లేవగానే ఏం జరుగుతుందో మా ఇద్దరికీ తెలుసు. కానీ సురేంద్ర ఏదో ఆలోచనలో వున్నాడని గ్రహించాను. అప్పటికి ట్రైన్ పూర్తిగా ఆగింది.

నేను దిగడానికి తొందరపడుతూ ''సురేంద్ర! విజయవాడ వచ్చేసాం. ఇంకా ఆలోచిస్తున్నారేంటి. ఇక్కడ దిగరా ఏంటి?''

సురేంద్ర కళ్లతోనే నన్ను వారించి నెమ్మదిగా, బలహీనంగా జనాన్ని తప్పించుకుంటూ వస్తున్న ఒక వయోవృద్ధుడ్ని దగ్గరకు రమ్మన్నట్లుగా చేత్తో సైగచేసి తన సీట్లో అతన్ని కూర్చుండబెట్టి బ్యాగ్ అందుకుని బయటకు నడక సాగించాడు. సందర్భోచితంగా ఆలోచించి ఆ ఆలోచనను క్షణాల్లో అమలుపరచిన సురేంద్రను ఉన్నఫళంగా అభినందించాలనిపించి అతన్నే అనుసరిస్తూ నేను కూడా వేగంగా బయటకు నడిచాను.

ఒక్కసారికాదు, మళ్లీ మళ్లీ కలవవలసిన వ్యక్తి సురేంద్ర అని ఆ క్షణమే గాఢంగా విశ్వసించాను.

★